క్లుప్తంగా

పట్టు ఉత్పత్తిని పెంచుదాం

ధర్మవరం రూరల్: పట్టు ఉత్పత్తిని పెంచి రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా కృషి చేద్దామని అనంతపురం ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ రమ్య పిలుపునిచ్చారు. మంగళవారం రేగాటిపల్లిలో 'నా పట్టు– నా అభిమానం' అనే ప్రచార కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆకుల నాణ్యత, దిగుబడిని పెంచడానికి పోషణ మల్టీ న్యూట్రియంట్ పిచికారీ చేయడం, తెగుళ్లు, వ్యాధుల నియంత్రణ కోసం పురుగు మందులకు బదులుగా వేపనూనెను వాడకం తదితర వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శోభారాణి, ఏడీ అప్పలనాయుడు, స్థానిక పట్టు పరిశ్రమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

తాడిమర్రి: గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అభివృద్ధి అధికారి (డీడీఓ) జనార్దన్‌రావు సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన తాడిమర్రిలోని 1, 2, కునుకుంట్ల గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల్లో ప్రజలకు అందిస్తున్న సేవల రికార్డులు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీల రిజిష్టర్, సిబ్బంది హాజరు తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకట రంగారావు, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్ శేఖర్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పశుదాణా పంపిణీ

బత్తలపల్లి: మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 200 మంది పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశుదాణా పంపిణీ చేసినట్లు బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి డాక్టర్ గుర్నాథరెడ్డి పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా టోర్నీకి కదిరి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

కదిరి అర్బన్: రాష్ట్రస్థాయి యోగా టోర్నమెంట్‌కు ఎరుకులవాండ్లపల్లిలోని హరీష్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ తెలిపారు. సోమవారం గుంతకల్లులో ఉమ్మడి అనంతపురం జిల్లా యోగా క్రీడాకారుల ఎంపిక జరిగినట్లు పేర్కొన్నారు. ఇందులో తమ పాఠశాల నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు.

22న జాబ్‌మేళా

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 93901 76421 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.


వివాహిత అదృశ్యం

కదిరి టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత అదృశ్యమైంది. భర్త పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని మౌజాన్ క్వాటర్స్‌లో నివాసముంటున్న తబ్రేజ్ కుమార్తె షేక్ రిటాజ్‌కు నిజాంవలి కాలనీకి చెందిన షేక్ ఇమ్రాన్‌బాషాతో పెద్దల సమక్షంలో రెండో పెళ్లి చేశారు. వారం రోజులుగా ఆమె ప్రతి చిన్న విషయానికీ భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లడం.. తల్లిదండ్రులు మందలించి తిరిగి మెట్టినింటిలో వదిలిపెట్టి రావడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఉదయం మెట్టినింటి నుంచి రిటాజ్ వెళ్లిపోయింది. భర్త ఎన్నిచోట్ల వెదికినా కనిపించకపోవడంతో మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

హాస్టల్‌లో సమస్యలపై ఆరా

పుట్టపర్తి: బుక్కపట్నం డైట్ కళాశాలను బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజేంద్రకుమార్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఏమైన సమస్యలు ఉన్నాయా అని అక్కడి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, హాస్టల్ వార్డెన్ లలిత, డైట్ సీనియర్ అసిస్టెంట్ నీలిమ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 48 మంది ఎంపిక



ఆర్డర్ కాపీలతో ఎంపికైన విద్యార్థులు

ధర్మవరం: పట్టణంలోని శ్రీవివేకానంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 48 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ తెలిపారు. హైదరాబాద్ నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించిన జాబ్‌మేళాలో మొత్తం ఏడు కంపెనీలు పాల్గొని 250 మంది అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 48 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని, 30 మంది అభ్యర్థులు తదుపరి రౌండ్‌కు ఎంపికయ్యారని వెల్లడించారు.



ధర్మవరంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్



ఆకుపూజ అలంకరణలో పోట్లమర్రి ఆంజనేయస్వామి

పవన పుత్రా పాహిమాం..

ధర్మవరం అర్బన్: శ్రావణ మాస నాలుగో మంగళవారం ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ

బత్తలపల్లి: పోట్లమర్రి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస చివరి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొమండూరు మారుతిప్రసాద్, సాయిక్రిష్ణ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి పంచామృత అభిషేకం, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆకుపూజ నిర్వహించి భజనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా ముష్టూరు, మాల్యవంతం, వేల్పుమడుగు గ్రామాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయాలు సైతం భక్తులతో కిటకిటలాడాయి.

భూముల వివాదంపై విచారణ

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీఓ



రైతులు సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సువర్ణ

నల్లమాడ: భూముల వివాదంపై ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్డీఓ సువర్ణ మంగళవారం పెమనకుంటకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. నల్లమాడ రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 589, 590, 591, 598, 599, 600లో దాదాపు 150 ఎకరాల భూమిని 50 ఏళ్ల క్రితం ఎన్.బడవాండ్లపల్లికి చెందిన సానే చెన్నారెడ్డి, సానే లక్ష్మిరెడ్డి, సానే గంగిరెడ్డి, వారి వారసుల నుంచి ఎన్.బడవాండ్లపల్లి, బాసంవారిపల్లి, అరవవాండ్లపల్లి తండా, పెమనకుంటపల్లి తండా, కొండ్రవారిపల్లికి చెందిన పలువురు రైతులు కొనుగోలు చేశారు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు భూములను కొనుగోలు చేసిన రైతులు, వారి వారసులు సాగు చేసుకొంటున్నారు. అయితే ఎన్.బడవాండ్లపల్లికి చెందిన ఓ రైతు సదరు భూములపై తమకూ హక్కు ఉందంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆ రైతు దౌర్జన్యంగా తమ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని బాధిత రైతులు ఇటీవల ఢిల్లీలో ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని ఆర్డీఓకు విన్నవించుకున్నారు. ఈ క్రమంలో ఆర్డీఓ మంగళవారం పెమనకుంట తండాలో పర్యటించి.. సాగు భూములను పరిశీలించారు. అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏబీబీఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డుంగావత్ రమేష్ నాయక్, ఉపాధ్యక్షులు, న్యాయవాది విశ్వనాథ్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు డుంగావత్ కుళ్లాయినాయక్‌లు హాజరై బాధిత రైతుల తరఫున వాదనలు వినిపించారు. భూముల కొనుగోలుకు సంబంధించి రైతుల వద్ద ఉన్న రిజిస్ట్రేషన్, ఇతరత్రా డాక్యుమెంట్లను ఆర్‌డీఓ సువర్ణ క్షుణ్ణంగా పరిశీలించారు. కొనుగోలు చేసిన భూముల్లో రైతులు సాగు చేసిన పంటలను సైతం పరిశీలించారు. భూములు కొనుగోలు చేసినట్లు రైతుల వద్ద ఆధారాలు ఉన్నాయని, సాగులో కూడా వారే ఉండటంతో ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని చెప్పారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రంగనాయకులు, వీఆర్ఓ పాపారాయుడు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్‌నాయక్, న్యాయవాది దశరథనాయక్, బంజారా సేవా సంఘం సత్యసాయి జిల్లా యూత్ అధ్యక్షుడు నారాయణస్వామి నాయక్, రైతులు రామానాయక్, వెంకటనారాయణరెడ్డి, పెద్ద గంగిరెడ్డి, బొజ్జేనాయక్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భాగ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ ఉదయం 10–30 నుంచి సాయంత్రం 5 గంటలవరకు జరిగేలా మార్పు చేస్తూ ఐవీఆర్ఎస్ కాల్స్‌కు అనుబంధంగా చేస్తున్న వీడియో కాల్స్ తొలగించాలన్నారు. సెలవురోజుల్లో సర్వేలు నిర్వహించకుండా చూడాలన్నారు. తగిన సిబ్బంది లేకుండా ఆర్థిక, సాంకేతిక సహకారంలేకుండా స్వామిత్వ పథకం సర్వే పూర్తి చేయాలని పంచాయితీ కార్యదర్శులపై ఒత్తిడి చేయడం తగదన్నారు. పంచాయతీలో దినసరి పారిశుధ్య పనులు నిర్వహించేందుకు 15వ ఆర్థికసంఘం నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రామ్మోహన్, మునాఫ్, ఆనంద్, నరసింహులు, కేదార్, సంయుక్త, సంజన, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాన్ని మార్పు చేయొద్దు

- మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి



పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంగా పుట్టపర్తి అన్ని విధాలా బాగుందని, అనవసరంగా మరొక ప్రాంతాన్ని జిల్లా కేంద్రం చేయవద్దని వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత పీఆర్ డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం మార్పుపై వస్తున్న ప్రచారానికి ముగింపు పలకాలని ప్రభుత్వానికి సూచించారు. మంగళవారం ఆయన బుక్కపట్నంలో విలేకరులతో మాట్లాడారు. పరిపాలనా పరంగాను, అన్ని నియోజకవర్గాలకూ అనుకూలంగాను ఉండటంతో పాటు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన సువిశాలమైన భవనాలు సిద్ధంగా ఉండటంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆలోచించి పుట్టపర్తిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి ప్రాంతాన్ని కాదని హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా మార్పు చేయాలని చూడటం ఎంతమాత్రమూ మంచిది కాదన్నారు. ప్రజలు కూడా ఎవ్వరూ జిల్లా కేంద్రం మార్పును కోరుకోవటం లేదన్నారు. అయినా మొండిగా మార్పు చేయాలని చూస్తే మాత్రం కలిసి వచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులతో కలిసి ఉద్యమాలు చేస్తామని భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు.

సదరం సర్టిఫికెట్‌తో దివ్యాంగులకు నోటీసులు

బత్తలపల్లి: రీ.వెరిఫికేషన్‌లో దివ్యాంగుల సదరం సర్టిఫికెట్ జత చేసి నోటీసులు అందజేయాలని ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదేశించారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయం నుంచి మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దివ్యాంగుల పింఛన్లపై వెరిఫికేషన్ నిర్వహించినట్లు తెలిపారు. అందులో వైద్యులు దివ్యాంగులకు ఇచ్చిన వైకల్య శాతం చూపించే సదరం సర్టిఫికెట్ కూడా ఇచ్చారన్నారు. వైకల్య శాతం తక్కువగా ఉందని నోటీసులు ఇస్తున్న వారికి సదరం సర్టిఫికెట్ అందజేయాలన్నారు. ఆ రెండిటినీ తీసుకుని అప్పీల్‌కు వెళ్తారన్నారు. అందరూ ఇది అనుసరించాలని సూచించారు. పెన్షన్ రద్దు– పెన్షన్ రకం మార్పుతో నోటీసులు పొందిన వారు ఏదైనా అప్పీల్ చేసుకోవాలనుకుంటే ఎంపీడీఓ కార్యాలయంలో అర్జీ, ఆధార్ కార్డు జిరాక్స్, పెన్షన్ రద్దు, పెన్షన్ మార్పు నోటీసు, సదరం సర్టిఫికెట్ (పాతది), సదరం సర్టిఫికెట్(కొత్తది) అందజేయాల్సి ఉంటుందన్నారు. అలాగే పింఛన్‌దారుకు సంబంధించిన ఏదైనా ఆస్పత్రిలో చికిత్స పొందిన, పొందుతున్న డాక్యుమెంట్లు ఇవ్వాలన్నారు. అప్పీల్ కోసం జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరంలేదన్నారు. ఎంపీడీఓ ద్వారా రీ అసెస్మెంట్‌కు వెళ్లాలని నోటీసులు ఇచ్చిన తర్వాత మాత్రమే నిర్దేశించిన ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అర్హులకు దివ్యాంగ పింఛన్లు ఇవ్వాలి



ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం ఆర్డీఓ మహేష్‌కు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్ బాషా మాట్లాడుతూ ధర్మవరం డివిజన్ పరిధిలో చాలామంది దివ్యాంగులను అనర్హులుగా ప్రకటిస్తూ పింఛన్ల రద్దుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. అర్హులైన దివ్యాంగులను రాజకీయ పార్టీలతో ముడిపెట్టి పింఛన్ల రద్దుకు పూనుకోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించడానికి అధికారులచే గతంలో ఉన్న సర్టిఫికెట్లు వెరిఫై చేసి అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని విన్నవించారు. దివ్యాంగులకు ఎలాంటి షూరిటీ లేకుండా రుణాలు మంజూరు చేయాలని, ఉపాధికి అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తల కదిరప్ప, సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారాయణ, చేనేత కార్మిక సంఘం నాయకులు వెంకటస్వామి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఎన్పీకుంట: సీజనల్ వ్యాధులు, దోమ కాటుతో వచ్చే వ్యాధుల పట్ల విద్యార్థినులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి డాక్టర్ బాలాజీనాయక్ సూచించారు. స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి సూచించారు. విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఆహారంపై ఈగలు వాలకుండా మూతలు పెట్టాలని, కాచి చల్లార్చిన క్లోరినేషన్ నీటిని విద్యార్థులకు ఇవ్వాలని భోజన నిర్వాహకులకు సూచించారు. విద్యార్థి దశ నుండే ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అనంతరం పాఠశాల గదులను, స్టోర్‌రూమ్, బాత్‌రూమ్‌లను తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వర రెడ్డి, పాఠశాల ఎస్ఓ, వైద్య ఇబ్బంది పాల్గొన్నారు.

కదిరి టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమ పుట్టరాదు – దోమ కుట్టరాదు అనే లక్ష్యంతో హెల్త్ అసిస్టెంట్ల విధులు నిర్వహించాలని డీఎంఓ ఓబులు, ఏఎంఓ లక్ష్మీనాయక్ తెలిపారు. పట్టణంలోని ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం హెల్త్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన డీఎంఓ మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉన్నందున లార్వా సర్వే, ఫీవర్ సర్వే విజయవంతంగా నిర్వహించి ప్రజలకు జ్వరాల పట్ల అవగాహన కల్పించి చైతన్యవంతులు చేయాలన్నారు. కార్యక్రమంలో కదిరి సబ్ యూనిట్ ఆఫీసర్ (తూర్పు) రామాంజులు, దేవలానాయక్, శివన్న, జయరాంనాయక్, గోపినాయక్, సూపర్‌వైజర్లు మహబూబ్ బాషా, శశిధర్, గంగాధర్, రమణ, హెల్త్ అసిస్టెంట్లు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' వాయిదా

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం జరగాల్సిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం వాయిదా వేసినట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు పోలీసుల అనుమతించక పోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేశామని, త్వరలో కార్యక్రమం నిర్వహించే తేదీ ప్రకటిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు గమనించాలని కోరారు.

'డబ్బు అడిగితే చంపుతామని బెదిరించారు'

దర్మవరం అర్బన్: అప్పుగా ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే చంపుతానని బెదిరించారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టూటౌన్ సీఐ రెడ్డప్ప మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని తారకరామాపురానికి చెందిన అలకుంట సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్. మారుతీనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ సిమెంట్ వ్యాపారం చేస్తే లాభాలు వస్తాయని చెప్పి అగ్రిమెంట్ ద్వారా సంతోష్, నారాయణ అనే వ్యక్తుల వద్ద నుంచి రూ.5.30లక్షలు, రూ.2.20 లక్షల చొప్పున మొత్తం రూ.7.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆరు నెలలు గడిచినా అనిల్‌కుమార్ వ్యాపారం గురించి ఎలాంటి సమాచారమూ చెప్పలేదు. దీంతో సంతోష్, నారాయణ ప్రశ్నిస్తే సిమెంట్ షాప్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేశానని అనిల్‌కుమార్ సమాధానమిచ్చాడు. అనుమానం వచ్చి బయట విచారించగా.. చాలామందితో అప్పులు చేసి దివాళా తీసినట్లు తెలిసింది. దీంతో వారు తమ డబ్బు తిరిగివ్వాలని ఒత్తిడి తీసుకొచ్చారు. మంగళవారం అతడి ఇంటికెళ్లి మరోమారు డబ్బు అడిగితే 'మీకు బాకీ లేనని, మా ఇంటికే వచ్చి నిలదీస్తారా.. మీ అంతు చూస్తా.. మిమ్మల్ని చంపుతా' అంటూ అనిల్‌కుమార్ బెదిరించాడు. బెంబేలెత్తిపోయిన సంతోష్, నారాయణ నేరుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

చేనేత కార్మికుడు అదృశ్యం



మురళి (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలో మురళి అనే చేనేత కార్మికుడు అదృశ్యమయ్యాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇందిరమ్మ కాలనీకి చెందిన చేనేత కార్మికుడు మురళి, రమ్య దంపతులు జీవనం సాగిస్తున్నారు. మురళి కుటుంబ పోషణ కోసం బయటి వ్యక్తులతో అప్పులు చేశాడు. అప్పులు తీర్చే విషయంలో తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో నెలన్నర క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మురళి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎన్నిచోట్ల వెదికినా జాడ కనిపించలేదు. భార్య రమాదేవి మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మురళి కోసం గాలిస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి

కనగానపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సన్నద్ధం కావాలని ఏడీఏ లక్ష్మణనాయక్ తెలిపారు. మామిళ్లపల్లిలో మంగళవారం జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్యతో కలసి ఆయన ఖరీఫ్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంటలకు వ్యాపిస్తున్న ఆకుమచ్చ తెగులు నివారణ కోసం సూచనలు చేశారు. ఇక మెట్ట పొలాల్లో వేరుశనగ పంట సాగుచేయని రైతులు ప్రత్యామ్నాయంగా తక్కువ కాలంలో చేతికి వచ్చే పెసర, అలసంద, జొన్న, కొర్ర వంటి పంటలు సాగు చేసుకోవాలన్నారు. వీటితో పాటు బోరుబావుల కింద సాగు చేసిన మొక్క జొన్న పంటలో సస్యరక్షణ చర్యలను వివరించారు. ఏఓ మాధురి, బీటీఎం ప్రతిభ, ఏఈఓ వీరాంజినేయులు, వీఏఏ త్రినాథ్‌రెడ్డి, జెడ్బీఎన్ఎఫ్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నల్లచెరువు: జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మొలకలచెరువుకు చెందిన నజీర్ మంగళవారం లగేజీ ఆటో బాడిగకు తీసుకొని కదిరిలో గొర్రెలు కొనుక్కొని తిరిగి స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గం మధ్యలో నల్లచెరువు సంతతోపు సమీపంలోకి రాగానే అదే వైపు వస్తున్న లారీ వెనుక భాగం ఆటోకు తగిలింది. దీంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో గొర్రెల యజమాని నజీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు గమనించి గాయపడిన నజీర్‌ను తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మరొక ఆస్పత్రికి పంపించినట్లు సమాచారం.

విద్యార్థులకు టీకాలు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మహేశ్వరమారుతి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలు వేశారు. 5, 10, 16 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు డీపీటీ బూస్టర్, టీడీ టీకాలు వేసి.. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వికసించిన బ్రహ్మకమలం



పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో బాబులరెడ్డి ఇంటి ఆవరణలోని బ్రహ్మకమలం చెట్టుకు 10 కమలాలు వికసించాయి. బ్రహ్మకమలాలు ఏడాదికోసారి పుష్పిస్తాయని పురోహితులు తెలిపారు. వికసించిన చెట్టుకు కుటుంబ సభ్యులు పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు.

సర్వేకు సహకరించండి

ఎన్పీకుంట: సుమోటో కుల ధ్రువీకరణ కోసం రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న సర్వేకు మండల ప్రజలు సహకరించాలని తహసీల్దార్ దేవేంద్ర నాయక్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసే పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయడం కోసం సెప్టెంబరు 15 వరకు వీఆర్ఓ, వీఆర్ఏలు మండలంలోని అన్ని పంచాయతీలు, గ్రామాలలో సర్వే నిర్వహిస్తారని తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

ధర్మవరం: ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లా సూపర్‌వైజర్ రమణ, ఎంఈఏ మురళి తెలిపారు. పట్టణంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ధర్మవరం ఎస్ఎంఎంఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎంఎస్ ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

30న సంచార జాతుల విముక్తి దినోత్సవం

పుట్టపర్తి టౌన్: విజయవాడలో ఈ నెల 30న నిర్వహించనున్న 'సంచార – అర్ధ సంచార జాతుల విముక్తి దినోత్సవం'ను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పుట్టపర్తిలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్‌దేవేంద్ర, ఆనంద్ విడుదల చేశారు.

జాతీయ జెండాకు అవమానం



ఎయిర్‌టెల్ వేణు భవనంపై ఎగురవేసిన జాతీయ జెండా



చిరిగిపోయిన జాతీయ జెండా

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు మండల కేంద్రంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. టీడీపీ నాయకుడు ఎయిర్‌టెల్ వేణు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మాణ దశలో ఉన్న తన భవనం వద్ద జాతీయ జెండా ఏర్పాటు చేశాడు. ఐదు రోజులవుతున్నా అవనతం చేయలేదు. అయితే గాలికి జెండా చినిగిపోయి ఎగురుతుండటం చూసిన స్థానికులు అసహనం వ్యక్తం చేశారు.

సమావేశం నేటికి వాయిదా

కదిరి అర్బన్: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం బుధవారానికి వాయిదా పడింది. కోరం లేకపోడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ భాగ్యలక్ష్మి తెలిపారు.

బంగారు గొలుసు చోరీ

కదిరి టౌన్: బంగారు గొలుసు చోరీ ఘటనపై సురేంద్ర అనే బాధితుడు మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ముదిగుబ్బ మండలం చెలిమి బావి వీధికి చెందిన సురేంద్ర ఈ నెల 16న కదిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద తన కుమార్తెతో పాటు బస్సు ఎక్కే క్రమంలో తనబ్యాగులో భద్రపరచిన ఐదు తులాల బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా వినాయకుడి విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.